క్లుప్తంగా

జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయిలు

పద్మనాభం: జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేయనున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. మండలంలోని విలాస్కాన్‌పాలెంలో గురువారం జలజీవన్ మిషన్‌పై నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జలజీవన్ మిషన్ కింద విలాస్కాన్‌పాలేనికి రూ10.90లక్షలు, తిమ్మాపురానికి రూ.6.80లక్షలు మంజూరయ్యాయన్నారు. వీటిలో పది శాతం గ్రామస్తులు కంట్రిబ్యూషన్ చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఏర్పాటు చేశారు. సర్పంచ్ నల్లి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు బోని సిమ్మప్ప పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వకుండా ఒడిశా ఆర్టీసీ కండక్టర్ల దందా

తగరపువలస: ఒడిశా నుంచి విజయనగరం మీదుగా విశాఖవైపు నడిచే ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సుల ఆదాయానికి సిబ్బందే గండి కొడుతున్నారు. విజయనగరం, తగరపువలస, ఆనందపురం, మధురవాడ ప్రాంతాల నుంచి ఒడిశా ఆర్టీసీ బస్సులలో విశాఖ ప్రయాణించే వారికి కండక్టర్లు డబ్బులు తీసుకుని టికెట్లు ఇవ్వడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బుధవారం గుణుపూర్ నుంచి విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన బస్సులో తగరపువలస నుంచి ప్రయాణించిన పలువురి నుంచి కండక్టర్ రూ.40 వంతున డబ్బులు తీసుకుని టికెట్లు ఇవ్వలేదు. ప్రయాణికులు టికెట్లు కోసం కండక్టర్‌తో వాదిస్తే దిగిపోవాలని హెచ్చరించాడు. దీంతో చేసేదిలేక టికెట్లు లేకుండానే ప్రయాణికులు విశాఖ వరకు ప్రయాణించారు. ఒడిశా బస్సులను తనిఖీ చేసే సిబ్బంది విజయనగరం, విశాఖ ప్రాంతాలలో ఉండనందున సిబ్బంది తరచూ ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాధవి

ఆనందపురం : స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మాధవి చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. తహసీల్దారు రామారావు, డిప్యూటీ తహసీల్దారు రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'గీతం'లో ఆరిజోనా స్టేట్ వర్సిటీ బృందం


వర్సిటీ బృందాన్ని సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

కొమ్మాది : అమెరికాలోని ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ అకడమిక్ నిపుణుల బృందం గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పాట్ ఫిలాన్, విద్యార్థి విభాగం డైరెక్టర్ మైక్ మాక్ బ్రైడ్ విభాగం సహాయ డైరెక్టర్ అర్జుహన్ కెవాక్, డిజైన్, ఆర్ట్స్ విభాగం ప్రొఫెసర్లు డా. సంగునిట్టి, డా. సన్నిక్యో తదితరులు విశ్వవిద్యాలయ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి గీతం వీసీ దయానంద సిద్దవట్టం ప్రపంచ శ్రేణి విద్యాలయంగా గీతంను తీర్చిదిద్దడానికి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో గురువారం పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా చేపలుప్పాడలో రూ. 10 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనం నిర్మాణానికి, చినఉప్పాడలో రూ. 3 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఆరోగ్య సేవలు సూపర్

- మధురవాడలలో 6 యూపీహెచ్‌సీలు ద్వారా సేవలు
- ఉచితంగా 56 రకాల పరీక్షలు


యూపీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



వాంబేకాలనీలో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ

మధురవాడ : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇటీవల ఏర్పాటు చేసిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగైన సేవలందిస్తున్నాయి. సుమారు కోటి రూపాయల వ్యయంతో ఒక్కో చోట విశాల భవనాన్ని నిర్మించడంతో అన్ని రకాల వసతులు కల్పించారు. రక్తం, ఇతర పరీక్షలకు కావలసిన సామగ్రి, సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. ప్రతి కేంద్రానికి పది మంది వరకు సిబ్బంది, వారంలో రోజుకు ఒక్క స్పెషలిస్ట్ కూడా వచ్చి సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5గంటలు వరకు సేవలు అందుతున్నాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో మారికవలస ఆర్‌జీకే కాలనీ, గణేష్‌నగర్, వాంబేకాలనీ, మిధిలాపురి వుడా కాలనీ, కొమ్మాది, పీఎంపాలెం తదితర చోట్ల యూపీహెచ్‌లు ఉన్నాయి.

ఉచితంగా పరీక్షలు

హెపటైటిస్-బి, కిడ్నీ ఫంక్షనింగ్(క్రియాటిన్), సెరాలజీ వంటివి వాటికి సాధారణ ల్యాబ్‌లో రూ.1000-రూ.1500 వరకు చార్జ్ చేయగా ఇక్కడ ఉచితంగా అందిస్తున్నారు. హిమోగ్లోబిన్, టీఎల్‌సీ, సీబీసీ, పీసీవీ, ఎమ్‌సీహెచ్, ఎమ్‌సీహెచ్‌సీ, టోటల్ రీడ్ బ్లెడ్ కౌంట్, డీఎల్‌సీ, ప్లేట్‌లెట్ కౌంట్, సీరమ్, యూరిన్, షుగర్, యూరిన్, హెచ్‌ఐవీ, లివర్ ఫంక్షనింగ్, బీపీ వంటి టెస్ట్‌లుకి సామగ్రి అందుబాటులో ఉంది.

అధునాతన పరికరాలు

యూపీహెచ్‌సీల్లో సెమీ ఆటో బయో కెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సెంట్రీఫ్యూగ్, మైక్రో స్కోపు, బయోమిక్సర్, సీబీసీ సెల్ కౌంట్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో సిబ్బంది, సౌకర్యాలతో పాటు 56 రకాలు చేయడానికి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రజల ఆరోగ్య కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్. శివ రామకృష్ణ, వైద్యుడు, యూపీహెచ్‌సీ, మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ

ఆంగ్ల భాష అభ్యాసనం ఎంతో అవసరం


ఆంగ్లభాషపై ప్రదర్శించిన అంశాలను పరిశీలిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్

భీమునిపట్నం: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆంగ్ల భాష అవసరం ఎంతో ఉందని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. గురువారం ప్రపంచ ఆంగ్లభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులందరు ఆంగ్లభాషపై పట్టు సాధించడానికి కృషి చేయాలని ఇది వారికి ఎంతో అవసరమన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత పిల్లలకు చక్కగా ఈ భాషను నేర్పించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు జీజీఎస్ నాగేశ్వరరావు, అధ్యాపకులు జే.మాధవి, ఎం.మహాలక్ష్మి, ఎస్.త్రినాథరావు, షేక్ అల్లావుద్దీన్, గొట్టేటి రవి పాల్గొన్నారు.

బైబై వైజాగ్


లొకేషన్‌లో విక్టరీ వెంకటేష్

కొమ్మాది: ప్రముఖ కథానాయకుడు విక్టరీ వెంకటేష్ హైదరాబాద్‌కు పయనమయ్యారు. పది రోజులు నుంచి ఉక్కు నగరంలో జరుగుతున్న సైంధవ్ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం వరకు షూటింగ్‌లో పాల్గొని ఆయన హైదరాబాద్ పయనమయ్యారు. రెండు రోజుల తరువాత భీమిలి లేదా కాకినాడ ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణ ఉండనున్నట్లు సినీవర్గాలు తెలిపాయి.

వెంకటేష్‌ను కలిసిన అభిమానులు

సైంధవ్ సినిమా చిత్రీకరణలో భాగంగా నగరంలో ఉంటున్న విక్టరీ వెంకటేష్‌ను విశాఖ సిటీ వైడ్ డీవీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ అర్జి శంకర్రావు, జిల్లా ప్రెసిడెంట్ పిళ్లా శ్రీను మర్యాద పూర్వకంగా కలిశారు. సైంధవ్ సినిమా సూపర్ హిట్ కావాలని ఆకాంక్షించారు.

చర్చలకు జ్యూట్ యజమాని డుమ్మా

తగరపువలస : నగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో గురువారం చిట్టివలస జ్యూట్ మిల్లు ఐక్య కార్మికసంఘాలు, మిల్లు యాజమాన్యం మధ్య కార్మికుల బకాయిలకు సంబంధించి చర్చలకు మిల్లు యజమాని బజోరియా గైర్హాజరయ్యారు. జేసీఎల్ రామారావు, పీఎఫ్ విచారణ అధికారి పీవీ లక్ష్మితో ఐక్య కార్మికసంఘాల ప్రతినిధులు నాలుగు గంటలపాటు చర్చలు జరిపారు. కార్మికుల బకాయిల విషయంలో యజమాని బజోరియా అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారని కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. దీంతో చర్చలను జేసీఎల్ ఈ నెల 27కు వాయిదా వేశారు. ఆ సమావేశానికి బజోరాయి హాజరయ్యేట్టు చూడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్మిక సంఘం, ఇంటక్, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ ప్రతినిధులు మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, పడాల రమణ, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, మద్దుల దేవుళ్లు, కొయ్య సూరి గురువులు, నరవ రామారావు, చిల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ తాగునీరే లక్ష్యం

తగరపువలస: ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీకి తాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జలజీవన్ మిషన్ పథకం కింద భీమిలి మండలం తాటితూరులో రూ.85.22 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయిల పథకానికి ఆయన శిలాఫలకం ఆవిష్కరించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండకూడదని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యనారాయణ, బోని బంగారునాయుడు, దుంపల నాగమణి, శిరిగుడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

తగరపువలస: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా తాళ్లవలసలోని చిట్టివలస అగ్నిమాపక కేంద్రం వద్ద వివిధ అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించి వాటి పనితీరును అగ్నిమాపక అధికారి జి.శ్రీనివాసరాజు, సిబ్బంది విద్యార్థులు, ప్రజలకు వివరించారు. అగ్నిప్రమాదాలు, బావులు, నదులలో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగినప్పుడు, శిథిల భవనాలు కూలినప్పుడు తప్పనిసరిగా అగ్నిమాపక సిబ్బందిని మిత్రులుగా భావించి సమాచారం అందించి సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

హరిత వృద్ధిని ప్రోత్సహించాలి


సమ్మేళనంలో పాల్గొన్న ప్రతినిధులు

ఆనందపురం : గంభీరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (ఐఐఎం) శాశ్వత ప్రాంగణంలో గురువారం పర్యావరణ సుస్థిరత, హరిత వృద్ధి, ఉద్గారాలు తగ్గింపు అనే అంశంపై జాతీయ స్థాయి సమ్మేళనం జరిగింది. నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో డీపీఐఐటీ, ఎంవోసీ, జీవోఎల్, యునైటెడ్ నేషనల్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియా, ఇండియా పొటాష్ లిమిటెడ్ కలిసి పరిశ్రమ భాగస్వామిగా ఈ సమ్మేళనంలో పాల్గొన్నాయి. ఉద్పాదకత, స్థిరమైన భవిష్యత్తు కోసం, హరిత వృద్ధిని ప్రోత్సహించే విధానాలను పలువురు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైనదిని, పర్యావరణంపై ఐఐఎంకు ఉన్న నిబద్ధతను చూపిస్తుందన్నారు. పరిశోధన, భోదన, సలహాలిచ్చే నైపుణ్యం ఇలా ఏరంగమైనా విజయవంతం కావాలంటే విలువలతో కూడిన వ్యవస్థలు అవసరమన్నారు. నేషనల్ ప్రొడక్టవిటీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ సందీప్ నాయక్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2030 నాటికి 500 గిగావాట్స్ శిలాజాలేతర ఇంధన సామర్థ్యాన్ని చేరుకోవడానికి కట్టుబడి ఉందన్నారు. స్థిరమైన పద్ధతులు, వనరుల సామర్థ్యం, పునరుత్పాదకత ఇంధన వనరుల ద్వారా మాత్రమే హరిత వృద్ధి సాధ్యమవుతుందని ఎన్‌పీసీ డైరెక్టర్ కేడీ భరద్వాజ్ సాంకేతిక ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో యూఎన్‌జీసీ ఎన్ఐ ఈడీ రత్నేష్‌ఝా కీలకోపాన్యాసం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఐఐఎం యాజమాన్యం పారిశ్రామిక కేంద్రమైన విశాఖలో సుస్థిరతను, ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రోత్సహించడానికి యూఎన్‌జీసీఎన్ఐ సంస్థతో అవగాహన కుదుర్చుకొని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

వెనక్కి వెళ్లిన సంద్రం


బయటపడ్డ బండరాళ్లు

భీమునిపట్నం: భీమిలి తీరంలో గురువారం అలలు బాగా వెనక్కి వెళ్లిపోయాయి. ప్రతి ఏడాది ఇలా సముద్రం వెనక్కి వెళ్లడం జరుగుతూనే ఉంది. ఈసారి గతంలోకన్నా మరింత దూరం అలలు వెనక్కివెళ్లిపోయాయి. దీంతో పెద్ద,పెద్ద బండరాళ్లు బయటపడ్డాయి. అలల తీవ్రత ఏమాత్రం లేకుండా ఉండడంతో చాలా మంది సందర్శకులు ఫొటోలు తీసుకుని సరదాగా గడిపారు.

గెడ్డల దురాక్రమణపై ఉక్కుపాదం


గెడ్డలో నిర్మించగా ధ్వంసం చేసిన పునాదులు


ఆక్రమిత ప్రాంతంలో విచారణ జరుపుతున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మాధవి, తహసీల్దారు రామారావు

సాక్షి ఎఫెక్ట్..

ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ కల్లివానిపాలేనికి సమీపంలో గల గెడ్డలను ఆక్రమించి విక్రయాలు జరుపుతున్న విషయమై రెవెన్యూ అధికారులు గురువారం విచారణ జరిపారు. సాక్షి దినపత్రికలో గురువారం 'గంభీరంలో గెడ్డలు దురాక్రమణ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ట్రైని డిప్యూటీ కలెక్టర్ కె.మాధవి, తహసీల్దారు ఎల్.రామారావు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ జరిపి గెడ్డను పరిశీలించారు. గెడ్డలను ఆక్రమించడం నిజమేనని నిర్ధారించుకున్నారు. ఈ మేరకు ఆక్రమితదారులపై క్రిమినల్ కేసులు పెట్టనున్నట్టు వారు వెల్లడించారు. ఇక్కడ సర్వే నంబరు 177లో ఉన్న గెడ్డవాగుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లగా విక్రయిస్తున్న వైనంపై అధికారులు విచారణ జరిపారు. గెడ్డ ఎంతమేర ఆక్రమణకు గురైందో గుర్తించారు. ఈ మేరకు యంత్రాలతో గెడ్డలో నిర్మించిన పునాదులను కూల్చివేశారు. గెడ్డలో కప్పేసిన మట్టిని తొలగించారు. పలు చోట్ల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గెడ్డ ఆక్రమించి నిర్మాణాలు జరిపిన వారిని, స్థలాలు విక్రయించిన వారిని గుర్తించామని పూర్తి స్థాయి విచారణ అనంతరం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు విజయ్ కుమార్, వీఆర్‌వో దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణాల పేరుతో మోసం

తగరపువలస : వ్యక్తిగత, హౌసింగ్ రుణాల పేరుతో ప్రయివేట్ బ్యాంకుల సిబ్బంది అమాయక ప్రజలను అందినకాడికి దోచుకుతింటున్నారు. ముందుగా ప్రయివేట్ బ్యాంకుల టెలీకాలర్స్ సిబ్బంది ఫోన్ల ద్వారా సంప్రదించి అతి తక్కువ సమయంలో తక్కువ వడ్డీకే ఈజీగా రుణాలు ఇస్తామని వల విసురుతున్నారు. తగరపువలసకు చెందిన చేట్ల రమణ అనే ముఠా కార్మికునికి నగరంలోని సీతమ్మపేటకు చెందిన ప్రయివేటు బ్యాంకు సిబ్బంది రూ.20 లక్షల హౌసింగ్ రుణం ఇస్తామని వల వేసి 2022 అక్టోబర్‌లో రూ.20వేలు కాజేశారు. ఆరుమాసాలు గడిచినా రుణమూ లేదు, ఇచ్చిన డబ్బులు వెనక్కూ ఇవ్వడం లేదు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు. ఆఫీసుకు వెళ్తే లోపలి నుంచే లేరని గెంటి వేస్తున్నారు. అలాగే మరో ప్రయివేట్ బ్యాంకుకు చెందిన లీనా అనే మహిళ రూ.20వేలు కట్టించుకుని తిప్పుతున్నట్టు రమణ వాపోయారు. మోసగాళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

తాటితూరులో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి


విలాస్కాన్‌పాలెంలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు


గడప గడపకు మన ప్రభుత్వంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం భీమిలి మండలం తాటితూరు పంచాయితీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేవలం ఆ పార్టీ సానుభూతిపరులకు, జన్మభూమి కమిటీ సిఫారసు చేసిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలకే 90 శాతం సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పట్టణ ప్రజలకంటే గ్రామీణ ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. తాటితూరు పంచాయతీకి రూ.10 కోట్ల సంక్షేమ, రూ.5కోట్ల అభివృద్ధి పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా బీసీ కాలనీ వాసులు స్పందిస్తూ 1997-98లో కాలనీ ఏర్పడిన తరువాత కుళాయిలు, డ్రైనేజీలు, రహదారులు కల్పించలేదన్నారు. పైగా పంచాయతీలోని మిగిలిన ప్రాంతాల నుంచి డ్రైనేజీ, వర్షంనీరు బీసీ కాలనీ మీదుగా ప్రవహిస్తుందన్నారు. డ్రైన్లు, రోడ్లు వసతులు కల్పించాలని డిమాండ్ చేయగా ఆరుమాసాలులో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వెంకటరమణ, సర్పంచ్ శిరిగుడి సంతోషి, వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, దుంపల నాగమణి, ఉండబట్ల వెంకట అప్పారావు, పల్లంటి శ్యామసుందరరావు, భాగం సుధాకర్, జీవీ నారాయణ, చిల్ల కృష్ణారెడ్డి, దుంపల ప్రభాకర్, రవ్వ ఈశ్వరరావు, వాసుపల్లి నల్లబాబు, సింగిడి అప్పలరాజు, మద్దిల గురునాయుడు, గోపిశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విలాస్కాన్‌పాలెంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఇంటింటికీ వెళ్లి సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ పాలన- వైఎస్సార్ సీపీ పాలనలో గల తేడాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంక్షేమ కరపత్రాలు, క్యాలెండర్లు ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లి సత్యవతి, బాందేవుపురంఎంపీటీసీ సభ్యురాలు బోని సిమ్మప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, రామసింగు ముత్యాలనాయుడు, నల్లి సన్యాసప్పడు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.


సంతపేటలో జరిగిన సర్వేలో గృహసారథులు, కన్వీనర్లు

'మా నమ్మకం నువ్వే జగన్'తో మరింత చేరువ

తగరపువలస: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రజలకు మరింత చేరువైందని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు అన్నారు. గురువారం శ్రీనగర్‌లో జరిగిన కార్యాలయంలో తమ్మిన నరసింగరావు, విజయసారథి, కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సంగివలసలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ, పీతల వెంకట అప్పారావు, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు. సంతపేటలో జరిగిన సర్వేలో చిప్పాడ వెంకటేష్, చిల్ల ప్రమీల, సరగడ పార్వతి, నీలాపు సురేష్‌రెడ్డి, సరగడ నాగిరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి తతతిరులు పాల్గొన్నారు. భీమిలి మండలం తాళ్లవలసలో జరిగిన కార్యక్రమంలో చిల్ల హరి, దంతులూరి వేణురాజు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి


అవగాహన కల్పిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో ఎక్కడైనా చెత్తాచెదారం కనిపిస్తే చర్యలు తప్పవని శానిటరీ సిబ్బందిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము హెచ్చరించారు. గురువారం ఇక్కడ కాపులదిబ్బడపాలెం వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్త వాహనం వచ్చినప్పుడు స్థానికులు సహకరించి తడి,పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని తెలిపారు. అనంతరం నర్సింహనగర్‌లో పర్యటించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎండలు మండుతున్న వేళ రైతులు, కూలి పనులకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లి సత్యవతి, బాందేవుపురం ఎంపీటీసీ సభ్యురాలు బోని సిమ్మప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లి సన్యాసప్పడు, బోని సన్యాసినాయుడు, రామసింగు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


అవంతి కళాశాల ఎదురుగా ప్రమాదానికి గురైన మూడు వాహనాలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ జాతీయరహదారిపై గురువారం పెను ప్రమాదం తప్పింది. తగరపువలస మీదుగా విజయనగరం వైపు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ ముందు వెళ్తున్న మరొక మిక్సర్ అడ్డు రావడంతో ఎడమవైపు మళ్లింది. అదే సమయంలో విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న సిటీబస్సు, దాని ముందు వెళ్తున్న కారుపై కాంక్రీట్ లోడుతో ఉన్న మిక్సర్ దూసుకువచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 80 మంది ప్రయాణికులు ఉండగా వీరిలో ఎక్కువమంది విద్యార్థులే. ఈ ప్రమాదంలో మూడు వాహనాలలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి, సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

ఘనంగా నూకాలమ్మ పండుగ


సీఐ లక్ష్మణమూర్తిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మవారి నెల పండుగ గురువారం ఘనంగా జరిగింది. గంటస్తంభం పక్కన ఉన్న వేదిక వద్ద నెల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఉత్సవాలకు సహకరించిన అధికారులు, దాతలను సత్కరించారు. ఈ సందర్భంగా పులివేషాలు, నేలవేషాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజిరావు, సభ్యులు పాల్గొన్నారు.